పాఠశాలల్లో పూలపండుగ

- పాఠశాలల్లో ఉత్సాహంగా ముందస్తు బతుకమ్మ సంబురాలు
- ఆడిపాడిన ఉపాధ్యాయులు, విద్యార్థినులు
- ఆకట్టుకున్న దాండియా నృత్యాలు, కోలాటాలు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ సంబరాలను జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో శనివారం ముందుగానే జరుపుకొన్నారు. ఆదివారం నుంచి దసరా సెలవులు ఉండడంతో ఉపాధ్యాయులు, విద్యార్థినులు తీరొక్కపూలతో బతుకమ్మలను అలంకరించి ఆడిపాడారు. భక్తిశ్రద్ధలు, ఆనందోత్సాహాల మధ్య నిర్వహించిన వేడుకలతో విద్యాసంస్థల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఉపాధ్యాయులు, విద్యార్థినులు లంగావోణి, చీరల్లో ముస్తాబై బతుకమ్మ పాటలతో నృత్యాలు చేసి అలరించారు. బతుకమ్మను మధ్యలో ఉంచి వేసిన కోలాటం ఆకట్టుకున్నాయి. అనంతరం బతుకమ్మలను నెత్తిన పెట్టుకొని ఊరేగింపుగా చెరువుల్లో నిమజ్జనం చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్

- జిల్లా కేంద్రంలోని రిషి పాఠశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన బతుకమ్మల వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆడిపాడారు. ఈ సందర్భంగా డైరెక్టర్ పూజిత మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఆచారాలు, సంప్రదాయాలు తెలంగాణ సంస్కృతిలో భాగం అని, ప్రకృతికి మనిషికి విడదీయరాని బంధం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, ఇన్‌చార్జి మాలతీ పాల్గొన్నారు.
- బీఎస్‌ఎన్‌ఎల్ భవనంలోని శ్రీ చైతన్య స్కూల్‌లో ఏజీఎం భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో బతుకమ్మ శనివారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీధర్, మనోహర్, డీన్ మహేశ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.
- జిల్లా కేంద్రంలోని మోనప్పగుట్ట జ్ఞానభారతి పాఠశాలలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు బతుకమ్మలు ఆడిపాడారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ లక్ష్మణ్, రిషి సంస్థల డైరెక్టర్ వెంకటయ్య, ప్రిన్సిపాల్ కిరణ్మయి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- షాసాబ్‌గుట్ట అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీఓ రాధిక, సూపర్‌వైజర్ వసీమ్ సుల్తానా, ఉపాధ్యాయురాలు మేఘమాల, అంగన్‌వాడీ టీచర్లు అప్సర్ ఉన్నిసాబేగం బతుకమ్మలతో ఆడిపాడారు.


మిడ్జిల్‌లోని సేయింట్ మేరీస్ పాఠశాలలో బతుకమ్మ సంబరాలు

ప్రకృతిని ఆరాధించే పండుగ బతుకమ్మ


బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచి బతుకమ్మ వేడుకలను జిల్లాకేంద్రంలోని మౌంట్‌బాసిల్ హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, మహిళా ఉపాధ్యాయులు రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి.. ఆడిపాడారు. దీంతో పాఠశాల ప్రాంగణం బతుకమ్మ పాటలతో, నృత్యాలతో మార్మోగింది. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ శిరీష ప్రవీణ్‌కుమార్ వేడుకలను ప్రారంభించి.. బతుకమ్మ విశిష్టతను వివరించారు. ప్రకృతిలో లభించే తీరొక్క పూలతో పండుగ నిర్వహించడం ప్రపంచంలో ఎక్కడా లేదని, అదే మన బతుకమ్మ ప్రత్యేక అని ఆమె తెలిపారు. పూలు వికసించే కాలంలో, జలాశయాల్లోకి సమృద్ధిగా నీళ్లు చేరి పొంగిపార్లే సమయంలో ఈ పండుగ వస్తుందని, భూమి, జలంతో మానవ అనుబంధాన్ని సంబరంగా నిర్వహించుకునేదే బతుకమ్మ అని వివరించారు. అందుకే ప్రకృతిని ఆరాధించే పండుగగా భావిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ చంద్రకళా వెంకటయ్య, డైరెక్టర్లు పూజిత మోహన్‌రెడ్డి, సుశాంత్‌కృష్ణ, ప్రిన్సిపాల్ సోమశేఖర్‌రెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.


మౌంట్‌బాసిల్ పాఠశాలలో..


షాసాబ్‌గుట్ట అంగన్‌వాడీ కేంద్రంలో..


జ్ఞానభారతి పాఠశాలలో బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం


రిషి స్కూల్‌లో బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం


శ్రీచైతన్య స్కూల్‌లో బతుకమ్మ వేడుకలు జరుపుకొంటున్న అధ్యాపక బృందం


నవాబుపేట పాఠశాలలో ఆడిపాడుతున్న అధ్యాపకులు, విద్యార్థినులు


కోయిల్ వద్ద దుందుభీ వాగులో బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు


మహమ్మదాబాద్ భాష్యం స్కూల్‌లో బతుకమ్మలతో వెళ్తున్న ఉపాధ్యాయులు


మిడ్జిల్ ఉన్నత పాఠశాలలో బతుకమ్మను నిమజ్జనానికి తీసుకెళ్తున్న ఉపాధ్యాయురాళ్లు


భూత్పూర్ సాహితి ఉన్నత పాఠశాలలో బతుకమ్మలతో చిన్నారులు

క్లుప్తంగా

రేపు ఉమ్మడి జిల్లాస్థాయి ఉషు ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని డీఎస్‌ఏ స్టేడియంలో ఈనెల 22వ తేదీన ఉదయం 9గంటలకు అండర్–14, అండర్–17, అండర్–19 విభాగాల బాల, బాలికల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉషూ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ శారదాబాయి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్కూల్ బోనఫైడ్, ఆధార్‌కార్డు జిరాక్స్, అండర్–19 విద్యార్థులు పదో తరగతి మెమో, ఆధార్‌కార్డు జిరాక్స్, బోనఫైడ్, మూడు ఎలిజిబిలిటీ ఫారాలతో ఎంపికలకు హాజరుకావాలని కోరారు. మిగతా వివరాల కోసం 9849301171 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పీఎం స్వనిధి పథకంపై అవగాహన



భూత్పూర్: ప్రధాన మంత్రి స్వనిధి పథకంపై ఎల్‌డీఎం డీఎస్ చంద్రశేఖర్ బ్యాంకర్లు, అర్బన్ లోకల్‌బాడీలకు శనివారం అవగాహన కల్పించారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ నూరుల్ నజీబ్, వైద్యాధికారి అబ్దుల్ నబీ, బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిరు వ్యాపారులు, స్ట్రీట్ వెండర్లకు ఆత్మనిర్భర్ నిధి, యూఎల్‌బీలకు అవగాహన కల్పించాలన్నారు. వీధివిక్రేతలకు వ్యాపారాల్లో అభివృద్ధికిగాను లోన్ సౌకర్యం కల్పించేలా చర్యలు, మైక్రో క్రెడిట్ సౌకర్యాల గురించి వివరించారు. పీఎం స్వానిధి పథకంపై విస్తృత ప్రచారం చేయాలని యూఎల్‌బీలను ఆదేశించారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ జిల్లా కన్వీనర్‌గా సౌమ్య



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఏబీవీపీ జిల్లా కన్వీనర్‌గా ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని సౌమ్య ఎన్నికయ్యారు. మంచిర్యాల్ లో జరిగిన ఏబీవీపీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. తనపై నమ్మకం ఉంచి జిల్లా కన్వీనర్‌గా ఎంపిక చేసనందుకు ఆమె రాష్ట్ర నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

కేజీబీవీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



దేవరకద్ర: కేజీబీవీలో నాన్ టీచింగ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని టీయూసీఐ జిల్లా కార్యదర్శి సాంబశివుడు డిమాండ్ చేశారు. శనివారం డోకూర్ కేజీబీవీ వద్ద 22న జరిగే ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వర్కర్ల కనీస వేతనాలు రూ.26వేలకు పెంచాలని, ఈఎస్‌ఐ, పీఎఫ్ అమలు చేయాలని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వర్కర్ల సంఖ్యను పెంచాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని, జీవో 60అమలు చేయాలని, వీక్లీ ఆఫ్ అమలు చేసి రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలపై నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు.

హక్కులు రక్షించాలని వినతి



మిడ్జిల్: బంజార, లంబాడా, సుగాలి కమ్యూనిటీ హక్కులను రక్షించాలని, వారిని ఎస్టీ జాబితా నుంచి తొలగించవద్దని కోరుతూ శనివారం లంబాడి నాయకులు తహసీల్దార్ రాజుకు వినతి పత్రం ఇచ్చారు. బంజారలను ఎస్టీ జాబితా నుంచి తొలగించుటకు కుట్రలు జరుగుతున్నాయని, అట్టి కుట్రలను విరమించుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎస్టీ నాయకులు లక్ష్మణ్ పవార్, నరేశ్ నాయక్, తిరుపతి, గోపి, రమేశ్, మధు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగు వివరాలు నమోదు చేసుకోవాలి

మరికల్: వర్షాకాలంలో రైతులు సాగు చేసిన పంటల వివరాలను వ్యవసాయ అధికారులతో నమోదు చేసుకోవాలని ఏఈఓ పరుశురామ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు సాగు చేసిన పంటలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు పాసు పుస్తకం జిరాక్స్ తీసుకెళ్లి వివరాలను నమోదు చేయించాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల దగ్గర పంటల నమోదు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కొత్త బస్టాండులో పరిశుభ్రత కార్యక్రమాలు


దసరా ఏర్పాట్లను పరిశీలిస్తున్న నగర కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక కొత్త బస్టాండు ఆవరణలో పలుచోట్ల పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని, పిచ్చిమొక్కలను 'స్వచ్ఛతా హీ'లో భాగంగా శనివారం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో తొలగించారు. కార్యక్రమంలో కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఏఎంసీ అజ్మీరా రాజన్న, ఆర్‌ఓలు మహమ్మద్ ఖాజా, యాదయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌జీ, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ చరణ్‌తోపాటు సిబ్బంది, ఎస్‌బీఐ అధికారులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన

బాలుర జూనియర్ కళాశాల ప్రాంగణంలో దసరా ఉత్సవాల కోసం చేస్తున్న ఏర్పాట్లను శనివారం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ రెడ్డి, మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. కాగా, ఇక్కడ ఈనెల 22 నుంచి బతుకమ్మ సంబరాలు, అలాగే చివరిరోజు వచ్చేనెల 2న రావణ కాష్టం నిర్వహించనున్నారు.

ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నిక నిర్వహించాలి

జడ్చర్ల: జడ్చర్ల లారీ అసోసియేషన్‌లో లొల్లి చోటు చేసుకుంది. కొన్నిరోజులుగా రెండు వర్గాల మధ్య విబేధాలు ముదురుతున్నాయి. ఏక పక్షంగా ఓ వర్గం వారు వారికివారు నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకుని ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డిని కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే మరోవర్గం వారు వీరి వ్యవహారాన్ని వ్యతిరేకిస్తున్నారు. ప్రజాస్వామ్య పద్ధతిన ఓటింగ్ ద్వారా ఎన్నిక నిర్వహించి కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. గతంలో ఏకగ్రీవం లేదా ఓటింగ్ ద్వారా లారీ అసోసియేషన్ ఎన్నిక జరిగేదని.. ఈ దఫా రెండు పద్ధతులను తుంగలో తొక్కి ఏకపక్షంగా నూతన కార్యవర్గాన్ని ప్రకటించుకోవడం తగదని పేర్కొంటున్నారు. లారీలు లేనివారు పదవుల్లో కొనసాగడం అసోసియేషన్ నిబంధనలకు విరుద్ధమన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా సమస్య పరిష్కారమయ్యే విధంగా కృషిచేస్తామని హామీ ఇచ్చారని, అయితే శనివారం క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యేను కలిసేందుకు తాము వెళ్లగా.. కనీసం తమతో మాట్లాడకుండా వెళ్లిపోయారని ఆరోపించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి ఇరువర్గాలతో చర్చించి న్యాయబద్ధంగా ఓటింగ్ నిర్వహించి లారీ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఏర్పాటు చేయాలని మాజీ అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్ డిమాండ్ చేశారు.


ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద లారీ యజమానులు

సంక్షిప్తంగా..

రేపు బాలుర కళాశాలలో మహిళల దసరా ఉత్సవాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: దసరా ఉత్సవ కమిటీ మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీన జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాల మైదానంలో దసరా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ గౌరవాధ్యక్షురాలు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత వెల్లడించారు. శనివారం సుశ్రుత ప్రజావైద్యశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. దసరా ఉత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. ఉత్సవాల్లో మహిళలు, విద్యార్థినులు బతుకమ్మ, జానపద నృత్యాలు, వెస్టన్ డాన్స్, కోలాటం తదితర ప్రదర్శనలు ఇస్తారని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు జరిగే కార్యక్రమంలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బెక్కం జనార్దన్, కార్యనిర్వాహక కార్యదర్శి కురుమూర్తి, ప్రశాంత్ పాల్గొన్నారు.

టైలర్ కుమారుడికి ఎంబీబీఎస్ సీటు



భూత్పూర్: పట్టణానికి చెందిన టైలర్ మహ్మద్ ముస్తాఖ్ కుమారుడు మహ్మద్ ముజాహిద్‌కు ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు పొందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు పూలమాల, శాలువాతో సన్మానించారు. పట్టణానికి చెందిన మహ్మద్ మహిమూద్‌కు ఇద్దరు కుమారులు. ఇద్దరు కుమారులు అంగవైకల్యంతో (మూగ, చవిటి)గా జన్మించారు. వీరికి చిన్నప్పటి నుంచి టైలరింగ్ ప్రావీణ్యం నేర్పించడంతో భూత్పూర్‌లో ముస్తాఖ్ టైలరింగ్ పనులు చేస్తున్నారు. ఇటీవల నిర్వహించిన మెడికల్ కౌన్సెలింగ్‌లో మహ్మద్ ముస్తాఖ్ (చవిటి, మూగ) కుమారుడు మహ్మద్ ముజాహిద్‌నాగర్‌కర్నూల్ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు పొందాడు. బీఆర్‌ఎస్ మైనార్టీ నేత మహ్మద్ సాధిక్, మైనార్టీ నాయకులు మహ్మద్ ముజాహిద్‌ను శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా పట్టణవాసులు సంతోషం వ్యక్తం చేశారు.

దేశాభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర కీలకం



మెట్టుగడ్డ: దేశాభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర కీలకమని సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జగపతిరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని టీచర్స్‌కాలనీలో ఏర్పాటు చేసిన సీనియర్ సిటిజన్ ఫోరం సమావేశంలో ఇంజినీర్లను సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మోక్షగుండం విశ్వేశ్వరయ్యను నేటి ఇంజినీర్లు ఆదర్శంగా తీసుకొని, నూతన ఆవిష్కరణలతో కూడిన, సాంకేతిక పరిష్కారాలను అందిస్తూ, కీలకమైన ఆనకట్టలు, రోడ్లు, భవనాలు, వంటి మౌలిక సదుపాయాల నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. అనంతరం పలువురు ఇంజినీర్లను ఫోరం సభ్యులు శాలువా, మెమోంటోతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రాజసింహుడు, ప్రధాన కార్యదర్శి నాగభూషనం, కోటిరెడ్డి, గంగాధర్, అశోక్, కృష్ణుడు, లక్ష్మణ్‌గౌడ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

దేవరకద్ర: మండలంలోని చౌదర్‌పల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం గుంజ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. అదే విధంగా పాఠశాలలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుధాకర్‌రెడ్డి, సంస్థ ప్రతినిధులు అశోక్‌సాగర్, సుదర్శన్‌గౌడ్, మల్లేశ్, కృష్ణ, అమీర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.



మహిళలను కోటీశ్వరులను చేస్తాం


ఎంప్లాయీస్ కాలనీలో మహిళా సంఘాల భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఏ పథకమైనా మహిళలకే ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మర్లులోని ఎంప్లాయిస్ కాలనీలో ముడా నిధులు రూ.22లక్షలతో నిర్మించే మహిళా సంఘాల భవనానికి శంకుస్థాపనతో పాటు అప్పన్నపల్లిలో మున్సిపల్ జనరల్ ఫండ్ రూ.10లక్షలతో చేపట్టే సీసీరోడ్డు పనులను శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నగరంలోని అన్ని కాలనీలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. మహిళలను కోటీశ్వరులుగా మారుస్తామన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో మహిళా సంఘాలను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, మాజీ వైస్‌చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, కాంగ్రెస్ నాయకులు సిరాజ్‌ఖాద్రీ, ఖాజాపాషా, అంజద్, గుమాల్ శ్రీను, రామకృష్ణ, శివ, పురుషోత్తం, అర్షద్ అలీ, సంజీవరెడ్డి, శ్రీనివాసులు, రమేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యున్నతికి కృషి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థుల అభ్యున్నతికి తాము కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని క్రౌన్‌గార్డెన్‌లో ట్రస్మా ఆధ్వర్యంలో ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు.

రేపటినుంచి నవరాత్రి ఉత్సవాలు

జడ్చర్ల టౌన్: దసరా పురస్కరించుకుని సోమవారం నుంచి దేవీశరన్నవ రాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉత్సవ కమిటీలు అమ్మవారి ప్రతిష్టకోసం ఏర్పాట్లు చేస్తున్నారు. రోజుకో అలంకారంలో అమ్మవారిని పూజించటం చేస్తుంటారు. పట్టణంలోని వాసవికన్యకాపరమేశ్వరి ఆలయంలో రోజుకో రూపం చొప్పున అమ్మవారి ఉత్సవ విగ్రహాలు ప్రతిష్ఠించనున్నారు. ఇందుకోసం ఏర్పాట్లు పూర్తయ్యాయి.

దుర్గామాతకు 11రోజులు పూజలు

దేవరకద్ర: మున్సిపాలిటీలో ప్రతిష్ఠించే దుర్గాదేవికి 11రోజులపాటు పూజలు నిర్వహించనున్నట్లు దసరా ఉత్సవ కమిటీ నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారికి 11రోజులపాటు వివిధ అలంకారాలు నిర్వహించడానికి ఏర్పాట్లను చేశారు. ఈనెల 22వ తేదీ సోమవారం బాలత్రిపుర సుందరిగా అలంకరించి పూజలు ప్రారంభిస్తారు. 23న గాయత్రిదేవి, 24న అన్నపూర్ణాదేవి, 25న కాత్యాయనిదేవి, 26న మహాలక్ష్మిదేవి, 27న లలిత త్రిపుర సుందరిదేవి, 28న మహాచండిదేవి, 29న సరస్వతిదేవి, 30న దుర్గాదేవి, అక్టోబర్ 1న మహిషాసురమర్దని, 2న రాజరాజేశ్వరిదేవిగా అలంకారాలు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అనాథ శవానికి ఎస్‌ఐ అంత్యక్రియలు

రాజాపూర్(బాలనగర్): అనాథ శవానికి అంత్యక్రియలు జరిపించిన ఘటన మండలంలోని మోతీఘనపూర్‌లో చోటుచేసుకుంది. బాలనగర్ మండలం మోతీఘనపూర్ సమీపంలో రెండు రోజుల కిందట అనాథశవం లభ్యమైంది. కాగా శవానికి సంబంధించి ఎలాంటి ఆచూకీ లభించలేదు. శనివారం ఎస్‌ఐ లెనిన్‌గౌడ్ సొంత ఖర్చుతో అనాథ శవానికి అంత్యక్రియలు జరిపించారు. దీంతో ఎస్‌ఐని పలువురు అభినందించారు.

వైద్యశిబిరం విజయవంతం

మిడ్జిల్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైనట్లు వైద్యాధికారి శివకాంత్ తెలిపారు. ఈ శిబిరంలో 138 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామని, వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ల్యాబ్‌కు శాంపిల్స్ పంపించామని, అవసరమైన వారికి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. శిబిరంలో డాక్టర్స్ సూర్య, అయ్యూబ్‌ఖాన్, తిమ్ములు, సునంద, ప్రసాద్, దేవయ్య, జంగయ్య, గీతా, రాజేశ్వరి పాల్గొన్నారు.

ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలి



మహబూబ్‌నగర్ రూరల్: కాంగ్రెస్ సర్కార్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సామాజిక పింఛన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని కోడూర్, గాజులపేట, రామచంద్రాపూర్ జీపీ కార్యాలయాల ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. వృద్ధాప్య, వితంతు పింఛన్లు రూ.4వేలకు, దివ్యాంగులకు రూ.6వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా నేటికి ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఆరోపించారు. పింఛన్లు పెంచకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు శ్రీరాములు, కమలాకర్, శాంతయ్య, ఉదయ్, కిరణ్, వెంకటేశ్, శేఖర్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు పెంచాలని దివ్యాంగుల నిరసన

చిన్నచింతకుంట: కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులు, వృద్ధులకు పింఛన్లు పెంచుతామన్న హామీ నెరవేర్చకుండా అన్యాయం చేసిందని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేందర్‌మాదిగ ఆరోపించారు. శనివారం మండలంలోని బండ్రపల్లి జీపీ కార్యాలయం ఎదుట దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులతో కలిసి ఆందోళన చేపట్టారు. కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బిక్షపతిమాదిగ, ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివకుమార్, వెంకటేశ్, శ్రీనివాస్, రామాచారి, ఉస్మాన్, మహేశ్వరి, ఎల్లమ్మ, కొండమ్మ పాల్గొన్నారు.

ఇసుక తరలించిన వారిపై కేసు నమోదు

చిన్నచింతకుంట: అక్రమంగా ఇసుక తరలిస్తున్న నలుగురిపై చిన్నచింతకుంట పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ ఓబుల్‌రెడ్డి కథనం ప్రకారం.. కౌకుంట్ల మండలం తిర్మలాపురం గ్రామానికి చెందిన పంతులు సత్యన్న, పంతులు గోవర్ధన్, మండ్ల అంజి, దేవరకద్ర అంజన్న కలిసి తిర్మలాపుం శివరులోని సర్వేనం 101 పొలంలో రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన ఇసుకను ఈనెల 18న తెల్లవారుజామున జేసీపీ, టిప్పర్ల ద్వారా తరలిస్తుండగా వీఆర్‌ఏలు అడ్డుకోగా.. వారు వినకుండా వాహనాలతో ఇసుకను నింపుకొని వెళ్లిపోయారు. ఈ విషయంపై కౌకుంట్ల ఆర్‌ఐ ఖదీర్ ఠాణాలో ఫిర్యాదు చేయగా వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మిడ్జిల్: మండలంలోని దోనూర్ ప్రాథమిక పాఠశాలలో శనివారం తల్లిదండ్రుల సమావేశం అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించినట్లు హెచ్‌ఎం తారాసింగ్ తెలిపారు. పోటీల్లో విజేతలకు దాత సుధాకర్‌గౌడ్ బ్యాగులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లక్ష్మయ్య, కృష్ణనాయక్, అంజలి పాల్గొన్నారు.

హంస క్వింటా రూ.1,809

దేవరకద్ర: దేవరకద్ర మార్కెట్ యార్డులో శనివారం జరిగిన ఈనామ్ టెండర్లలో హంస ధాన్యం ధర క్వింటాకు గరిష్ఠంగా రూ.1,809, కనిష్ఠంగా రూ.1,741గా ధరలు లభించాయి. మార్కెట్‌కు ప్రస్తుతం కత్తెర వడ్లు అమ్మకానికి వస్తున్నాయి. ఆదివారం మార్కెట్‌కు సెలవు కాగా సోమవారం మార్కెట్‌లో లావాదేవీలు కొనసాగుతాయి.

ఆది కర్మ యోగి అభియాన్‌పై శిక్షణ



మహమ్మదాబాద్: ఆర్థికంగా, అభివృద్ధిపరంగా వెనుకబడిన గిరిజన ప్రాంతాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకోవాలని గిరిజన సంక్షేమశాఖ మాస్టర్ ట్రైనర్ పద్మజ తెలిపారు. శుక్ర, శనివారాల్లో రెండు రోజులపాటు ఆయా గిరిజన తండాల ఉపాధ్యాయులకు ఆది కర్మ యోగి అభియాన్ శిక్షణపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గిరిజనుల జీవన ప్రమాణాలను మెరుగు పరిచేందుకు అందరికీ విద్య, వైద్యం, పౌష్టికాహారం తాగునీరు, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని అందుకు ఆయా గ్రామాల్లో నివేదికలు తయారు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా వారికి ట్రైనింగ్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏపీఓ హర్శ్చంద్రుడు, ఎంఈఓ రాజునాయక్, ఏఈ రామకృష్ణ, ఫారెస్ట్ అధికారి లావణ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.